



దీక్షలను ప్రారంభిస్తున్న నారాయణ

నేను నమ్ముకున్నది ప్రజలనే...

- ఎమ్మిగనూరు నుంచి పత్తికొండకు హై లెవెల్ బ్రిడ్జి - 'చేదోడు' సభలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ఎమ్మిగనూరు



తాను నమ్ముకున్నది ప్రజలనేనని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మిగనూరులో 'జగనన్న చేదోడు' నాలుగో విడత జమ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి ముందుగా గన్నవరం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి హెలిక్యాప్టర్ ద్వారా ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా వీవర్స్ సొసైటీ మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. అనేక స్వయం ఉపాధి పథకాల ద్వారా తోడుగా ఉంటున్నామని తెలిపారు. ఏ పార్టీకి ఓటేశారో అడగకుండా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటో ఆలోచించాలని కోరారు. అప్పట్లో గజదొంగల ముఠా రాష్ట్రాన్ని దోచుకోవడం, పంచుకోవడం, తినడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం బటన్ నొక్కితే డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని చెప్పారు. వైద్యం అవసరమైతే తోడుగా ఉండే ప్రభుత్వం, ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ తమ దగ్గరకే వచ్చే ప్రభుత్వం, ఇల్లు కట్టించే తపన ఉన్న ప్రభుత్వం కావాలని ప్రతి పేద కుటుంబం కోరుకుంటుందని తెలిపారు. తాము మేనిఫెస్టోలోని 99 శాతం వాగ్దానాలను అమలు చేశామన్నారు. ఓటు వేసేటప్పుడు ఇంట్లో మంచి జరిగిందా లేదా కొలమానంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం బటన్ నొక్కి 3.25 లక్షల మంది ఖాతాల్లో రూ.325 కోట్లు 'జగనన్న చేదోడు' మొత్తాన్ని జమ చేశారు. మెగా చెక్ పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ... కష్టం తప్ప కల్మషం లేని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను తన వాళ్లని చెప్పుకున్న నాయకుడు గతంలో లేరని, వీరంతా జగనన్న బంధువులని తెలిపారు. అగ్రవర్ణాల్లోని పేదలు కూడా జగనన్న బంధువులేనన్నారు. వీరంతా గతంలో మోసపోయారని చెప్పారు. జీవితాలు మారాలంటే కులవృత్తులకే పరిమితం కాదని, విద్య మాత్రమే మార్గమని తెలిపారు. నాడు వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తీసుకొచ్చారన్నారు. తర్వాత మళ్లీ కోతలు పెట్టారన్నారు. నేడు ముఖ్యమంత్రి జగన్ ప్రతి బీసీ గర్వపడేలా, మిగిలినవారంతా బాగుపడేలా కులగణన చేయబోతున్నారని తెలిపారు. ఇది జీవితాలను మార్చబోతోందని చెప్పారు.




మెగా చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

పాదయాత్ర చేసి ప్రజల మధ్య తిరిగి

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ... 2014లో ఓడిపోయినా పట్టువీడని విక్రమార్కుడిలా జగన్ పోరాడారని తెలిపారు. పాదయాత్ర చేసి ప్రజల మధ్య తిరిగి సమస్యలు తెలుసుకుని అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలో చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ఇస్తున్నారన్నారు. నాగులదిన్నె బ్రిడ్జి టిడిపి హయాంలో నిలిపి వేశారని, తమ ప్రభుత్వంలో ఆ పనులను చేశారని తెలిపారు. ఆరోగ్య పరంగా 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేశారన్నారు. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుమ్మనూరు జయరామ్, ఎంపీ సంజీవ్ కుమార్, కలెక్టర్ డాక్టర్ సృజన, ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కంగాటి శ్రీదేవి, సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, కర్నూలు మేయర్ బివై.రామయ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

నిర్బంధాలకు పాల్పడితే ఎన్నికల తర్వాత ఇంటికే

- నగేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు పర్యటనకు వస్తున్న సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఎమ్మిగనూరు ఆదోని ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, శీను, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ,జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, నాయకులు అజిత్ ను ముందస్తు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ ఒక ప్రకటనలో ఖండించారు. జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా విద్య,ఉపాధికి సంబంధించి రాష్ట్రంలో ఈరోజు అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన పథకాలు విద్యార్థుల తల్లిదండ్రులకు వరాలు అని విద్య మొత్తం ఉచితంగా అందుతుందని ప్రగల్బాలు పలకడం తప్ప వాస్తవానికి అమ్మ ఒడి డబ్బులకి ప్రవేట్ పాఠశాలల్లో పుస్తకాలు కూడా రావడం లేదన్నారు. అనేక కండిషన్లు పెట్టి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్‌తో పేదలందరూ చదువుకునే పరిస్థితి నుండి ఇప్పుడు ఉన్న కండిషన్ ల వల్ల ఆన్లైన్లో అడ్మిషన్ల వల్ల చాలామంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ప్రాథమిక విద్య సహితం రాష్ట్రంలో అందని ద్రాక్షలా మారిందని తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్‌క్యాలెండర్లు విడుదల చేయకపోవడం ఇంతవరకు డిఎస్‌సి, గ్రూప్స్ నోటిఫికేషన్లు లేకపోవడం వీటి గురించి ఎవరు ప్రశ్నించినా అక్రమంగా నిర్బంధాలకు పాల్పడుతుందని తెలిపారు. విద్య అందరకు అందాలి అంటే కేవలం రంగులు వేయడం పాఠశాలల్లో బాత్రూంల ఫోటోలను ఉపాధ్యాయులతో తీయించినంత మాత్రాన సరైన విద్య అందదని, విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు, మౌలిక వసతులు ఉండాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంక్షేమం అనేది పేదలపై వేస్తున్న బారాలలో వారికి అందుతున్నది 5 శాతం మాత్రమే అని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నూతన పరిశ్రమల ఏర్పాటు పూర్తిగా కుంటుపడి డిగ్రీలు పీజీలు బీటెక్ లు ఫార్మసీలు నర్సింగ్ లు చదువుకున్న యువతి యువకులు నిరుద్యోగంతో మగ్గిపోయి వృద్ధాప్యం దగ్గర పడుతున్న తల్లిదండ్రులకు భారంగాను మానసికంగానూ కుంగి పోతున్నారని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రజాగ్రహానికి గురై 2024 ఎన్నికల తర్వాత జగన్ మోహన్ రెడ్డి లోటస్ పాండ్‌కు లేదా అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయి జైలు జీవితం గడపాల్చి వస్తుందని హెచ్చరించారు.

నిర్బంధం...

- సీఎం పర్యటన నేపథ్యంలో పలువురి అరెస్ట్, హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి – కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో పలువురు నాయకులపై పోలీసులు నిర్బంధం ప్రదర్శించారు. పలువురిని అరెస్ట్ చేయగా మరికొందరిని హౌస్ అరెస్ట్ చేశారు. కర్నూలులో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లాను ఇంట్లో నుండి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎమ్మిగనూరులో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ఆదోనిలో ఎస్ఎఫ్ఐ నాయకులు శీను, కర్నూలు లో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘ వేంద్ర, ఉపాధ్యక్షులు సురేష్, నాయకులు అజిత్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆదోనిలో టిడిపి నాయకురాలు గుడిసె ఆది కృష్ణమ్మను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో నిర్బంధాలను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ ఒక ప్రకటనలో ఖండించారు. సిఎం పర్యటన ముగిసిన తరువాత అరెస్ట్ చేసిన నాయకులను వదిలేశారు.



పోలీసుల అదుపులో ఉన్న శ్రీనివాసులు

టీచర్లపై కక్ష సాధింపు మానుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ

- యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు చేస్తుందని, ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని వారు దాచుకున్న సొమ్మును సైతం రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుంది సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ అన్నారు. గురువారం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానం అమలులోకి తెచ్చిందని జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కర్నూలు ధర్నా చౌక్‌లో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు అధ్యక్షతన చేపట్టిన యుటిఎఫ్ దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 117 జిఒ వలన ఉపాధ్యాయులు లేక ,పిల్లలు లేక స్కూల్స్ వెల వెల పోతున్నాయన్నారు. విద్యారంగం పూర్తిగా నాశనమైందన్నారు. రాష్ట్రంలో విద్యను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసమే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇచ్చిన మాటలు పేపర్లకే పరిమితం అయ్యాయని, ఒక్క అవకాశం ఇవ్వండి అని ప్రాధేయపడి ఇంకొక అవకాశం ఇవ్వకుండా చేసేలా పరిపాలన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్య వ్యవస్థను నాశనం చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజు మాట్లాడుచూ గత ఎన్నికలలో పాదయాత్రలో భాగంగా సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో అమలు చేస్తామని ఐదేళ్లు కావస్తున్నా సిపిఎస్‌ను రద్దుచేయకపోగా జిపిఎస్ అనే కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. జిపిఎస్ రద్దు అయ్యేంతవరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు.

దీక్షలకు పలువురి సంఘీభావం

యుటిఎఫ్ చేపట్టిన దీక్షలకు ఎస్‌టియు నాయకులు గోకారి, జనార్దన్ ,నాగరాజులు, ఎపిటిఎఫ్ 1938 నుండి ఇస్మాయేలు, మరియానందం , సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ,టిడిపి కోడుమూరు నాయకులు ఆకుపోగు ప్రభాకర్ ,బిసి సంఘం జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. యుటిఎఫ్ నాయకులు జె.ఎల్లప్ప, నవీన్ పాటి, దావీదు, గాదిలింగప్ప, నరసింహులు, యెహోషువా, రంగన్న, సురేష్‌బాబు, నాగరాజు, పాల్గొన్నారు.

సిఎంకు ఘన స్వాగతం





ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా గురువారం ఆయనకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి గన్నవరం విమానాశ్రయం నుండి ఓర్వకల్ విమానాశ్రయానికి చేరుకోగా అక్కడ జిల్లా ఇన్చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపి పోచ బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ సుధాకర్, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్రనాద్ రెడ్డి ,ఆర్థర్, శిల్పా చక్రపాణి రెడ్డిలు, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఇసాక్‌బాషాలు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మిగనూరు చేరుకోగా అక్కడ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి సాయి ప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, హాఫీజ్ ఖాన్ వైసిపి జిల్లా అధ్యక్షుడు నగర మేయర్ బివై.రామయ్య, మాజీ ఎంపీ బుట్టా రేణుక, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ విజయ మనోహరి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి నేరుగా వీవర్స్ సొసైటీ మైదాన ప్రాంతానికి కాన్వాయ్ ద్వారా వెళ్లారు. అక్కడ జగనన్న చేదోడు ఆర్థిక సాయం మంజూరు కార్యక్రమాన్ని ముగించుకొని మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కూడా ముఖ్యమంత్రికి అధికారులు ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు.





స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్ ఖాన్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్‌ఖాన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నియోజకవర్గ పరిధిలోని, 47వ వార్డులోని 121వ సచివాలయం, శ్రీనివాస్ నగర్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, నాయకులు కాలనీలోని ప్రతిగడపకు వెళ్లి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ ఎన్.అరుణ, రైల్వే ప్రసాద్, భారతి, సుధాకర్, సందీప్, లక్ష్మణ్, లాజర్, బాషా, నాగరాజ్, నజీర్, అబ్దుల్లా, ఏసు, కిరణ్, అక్బర్, ఇమ్మి, స్థానిక వైసిపి నాయకులు నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, ఆర్‌పి లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కెవిఆర్‌లో నాయకత్వ లక్షణాలపై సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న విసి సాయి గోపాల్

నగరం లోని కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఘనంగా నాయకత్వ లక్షణాలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ సాయి గోపాల్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రెహమాన్ లు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు చదువుకునే స్థాయి నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. మంచి దృక్పథంతో పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. సంకల్పం గొప్పగా ఉంటే విజయం వరిస్తుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. దేవికారాణి డాక్టర్ కె. వెంకట కృష్ణ, నిర్వాహకులు, డాక్టర్ భాశెట్టి లత, అధ్యాపకులు రాధా రమణి, డాక్టర్ ఖాజా మొహినిద్దీన్, విజయలక్ష్మి వినీలా, మహబూబ్ బాష, నజీరుద్దీన్, శ్రీనివాసులు, మౌనిక, అధ్యాపకులు అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ

రాష్ట్ర కమిటీకి పంపిస్తామన్న డి విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కోడుమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో చంద్రబాబు నాయుడుకు మద్దతుగా లక్ష సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డి.విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాలుగు మండలాల్లో ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి స్వచ్ఛందంగా దాదాపు లక్ష సంతకాలు సేకరణ పూర్తి చేయడం గర్వంగా ఉందన్నారు. చంద్రబాబుపై కుట్రతో కేసులు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌లో జైల్లో ఉంచారని దీన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం 30 సెక్షన్ అమలు చేస్తూ ప్రతిపక్ష పార్టీల స్వేచ్ఛను హరించి వేస్తుందని ఆరోపించారు. యువగలం పాదయాత్రకు ప్రజల్లో మంచి స్పందన వస్తుందని దీన్ని అడ్డుకునేందుకే చంద్రబాబుపై కుట్ర కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు సర్పంచి దస్తగిరి, పంచలింగాల సర్పంచి కృష్ణయాదవ్, ఎంపిటిసి కురువ నాగరాజు, గూడూరు, సి బెళగల్, కోడుమూరు, కర్నూల్ రూరల్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి సీనియర్ నాయకులు డి విష్ణువర్ధన్ రెడ్డి



మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న గౌరుచరిత

టిడిపి మినీ మేనిఫెస్టోతో ప్రజలకు లబ్ధి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి మినీ మేనిఫెస్టోతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. గురు వారం పాణ్యం నియోజ కర్గం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో బాబుతో నేను, భవి ష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిం చారు. గౌరు చరిత ,టిడిపి శ్రేణులు, జనసేన పార్టీ కార్య కర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు అరెస్ట్ గురించి వివరిస్తూ టిడిపి బల పరిచిన మినీ మేని ఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు.మండల అధ్యక్షుడు గోవింద రెడ్డి, మండల నాయ కులు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీ కాంతరెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణపల్లె నాగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నన్నూరు గ్రామ నాయకులు విజయుడు, మైనారిటీ నాయకులు ఖాజామియా, సర్కార్, షేరు బాషా, జాకీర్ హుస్సేన్, మొల్ల షఫీ, వైస్ ప్రెసిడెంట్ పద్మావతి, దులం మద్దయ్య, పాల్గొన్నారు.

పత్తికొండ ఆర్‌డిఒగా రామలక్ష్మి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా నీలపు రామలక్ష్మీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారి చేసింది. ఇక్కడ ఆర్‌డిఒగా పనిచేస్తున్న మోహన్ దాస్‌ని నేరుగా జిఎడిలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులలో పేర్కొంది.



ఆర్‌డిఒ రామలక్ష్మి

నరేంద్ర ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి-పత్తికొండ

ఎస్ఎఫ్ఐ పత్తికొండ మాజీ ఉపాధ్యక్షులు నరేంద్ర ఆశయాలను కొనసాగించాలని జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. గురువారం పత్తికొండ మండలం హోసూరు గ్రామంలోని సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ ,మండల కార్యదర్శి రంగారెడ్డి, మండల కమిటీ సభ్యులు గంగన్న, సురేంద్ర, ఎస్ఎఫ్ఐ మాజీ ఉపాధ్యక్షులు నరేంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. సంస్మరణ సభలో నరేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. విద్యార్థులు ఆయన అడుగుజాడల్లో నడిచి ఆశయాలు కోసం పనిచేయాలని అన్నారు. నరేంద్ర కుటుంబానికి సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న గౌస్‌దేశాయి, తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ , వేదికపై ఎంపిపి వెంకటేశ్వరమ్మ

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురు వారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ హాజరయ్యారు. అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజలను అన్ని విధాల ఆరోగ్యంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్య క్రమంలో ఏడు రకాల పరీక్షలను ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాసులు, ఎంపిటిసి గోపాల్, కృష్ణవేణి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, రాజశేఖర్ రెడ్డి, సూర్యచంద్ర రెడ్డి, భరత్ రెడ్డి, రాజశేఖర్, తిమ్మప్ప, గౌస్ వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్ గౌడ్, మండల అధికారులు డాక్టర్లు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజక కుటుంబంపై దాడి చేసిన గ్రామ సర్పంచి మంజునాథ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లా హిందూపురం మండలం పూలకుంట గ్రామంలో కొల్లాపురమ్మ గుడి వద్ద పూజ నిర్వహిస్తున్న రజక కుటుంబంపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచిన గ్రామ సర్పంచి మంజునాథ్ ను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. సి. గురుశేఖర్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న సహకార్యదర్శి సి.శేషాద్రి ట్రెజరర్ సిహెచ్.శ్రీనివాసులు, సహకార్య దర్శి సి.జయమ్మ, ఉపాధ్యక్షుడు సి. రాముడు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రతినెల ఏదైనా ఒక జిల్లాలో రజక కుటుంబాలపై అగ్రవర్ణ పెత్తందారులు దాడులు, దౌర్జన్యాలు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ,అధికార ప్రతిపక్ష పార్టీలతో నిమిత్తం లేకుండా అగ్రవర్ణ పెత్తందారులు ఈ దాడులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వలన అగ్రవర్ణాల నుండి రజకులు ఇలాంటి పలు ఇబ్బందులకు గురవుతున్నారని ,రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికైనా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రజక కుటుంబంపై దాడి జరిపిన అగ్రవర్ణ గ్రామ సర్పంచి మంజునాధుని అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామాన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెకైనా సిద్ధం

- అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి సమ్మెకైనా సిద్ధమని యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. గురువారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం రేణుకమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిఐప అధికారంలోకి వస్తే అంగన్వాడీ ఉద్యోగులను ఆదుకుంటానని ఎన్నికల ముందు చేసిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరిచారన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వరలక్ష్మి, సుహాసిణి, ప్రభావతి, కాంతమ్మ, పద్మ, లూసమ్మ, కృష్ణవేణి, మహేశ్వరి, బాల దర్గమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటమ్మ

దేవరగట్టు చేరుకున్న విగ్రహమూర్తులు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని నెరణికి గ్రామంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, దసరా సందర్భంగా ఈనెల 24న కల్యాణోత్సవం (బన్నీ ఉత్సవం) నిర్వహించేందుకు శ్రీమాల మల్లేశ్వర విగ్రహమూర్తులను దేవరగట్టుకు తీసుకెళ్లి సింహాసన కట్టపై ఆశీనులను చేశారు. దసరా సందర్భంగా 24న కల్యాణోత్సవం (బన్నీ ఉత్సవం), 26న రథోత్సవం, 27న గురవయ్యలాట గొలుసు తెంపుట, సాయంత్రం దేవదాసులో నృత్యాలు, క్రీడలు నిర్వహిస్తారు.


విగ్రహమూర్తులను తెస్తున్న గ్రామస్తులు

బన్నీ ఉత్సవంపై అవగాహన సదస్సులు

ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ దేవరగట్టును సందర్శించి బన్నీ ఉత్సవాలపై ఆరా తీశారు. భక్తులకు అవగాహన కల్పించారు. తాగునీరు, మురుగుదొడ్లు, లైటింగ్ వ్యవస్థ, తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకూడదని సూచించారు. జిల్లా అధికారుల సూచనల మేరకు ఆయా శాఖల అధికారులు ఇప్పటికే దేవరగట్టు బన్నీ ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదోని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, హోళగుంద ఎస్ఐ శ్రీనివాస ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో ముఖ్యమైన గ్రామాల్లో కార్డెన్ సెర్చ్, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

హామీల అమలు ఎక్కడ..? : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

హామీల అమలు ఎక్కడ అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్లకార్డులు, నల్ల కండువాలతో నిరసన తెలుపుతున్న తమను, కార్యకర్తలను పోలీసులు నిర్బంధించడం దురదృష్టకరమని తెలిపారు. గతంలో టిడిపి హయాంలో మంజూరు చేసిన ఆర్‌డిఎస్ ప్రాజెక్టు, టెక్స్‌టైల్స్ పార్కు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.


నివాసం వద్ద నిరసన తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

పారదర్శకంగా రీ సర్వే : తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు ఏ సమస్య ఎదురవకుండా రీ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని నంచర్ల గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి తిమ్మప్ప, విలేజ్ సర్వేయర్లు రోజి చేపట్టిన పొలం రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్న సమయంలో సంబంధిత రైతులందరికీ సమాచారం ముందుగా ఇస్తామని తెలిపారు. రైతులకు ఏ సమస్యలూ ఎదురవకుండా సర్వే నిర్వహిస్తున్నప్పుడు దగ్గర్లోనే ఉండాలని సూచించారు. అధికారులకు ఏమైనా సమస్య ఎదురైతే రైతులకు పూర్వాపరాలు అడిగి తెలుసుకుంటారన్నారు. సర్వే నిర్వహిస్తున్నప్పుడు చాలా సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరిస్తూ పోతున్నామన్నారు. రైతులు, గ్రామ సేవకులు పాల్గొన్నారు.


నంచర్లలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్

లోగుట్టు నిగ్గు తేలేనా..!

- కబ్జాలకు నిలయంగా ఆదోని...
- 352 సర్వే నెంబరులో అక్రమాలు
- రెండు, మూడు సార్లు రిజిస్ట్రేషన్లు...

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని కబ్జాలకు నిలయంగా మారిందని, అధికార పార్టీ నాయకుల అండతోనే అంతా జరుగుతోందని ప్రచారం సాగుతోంది. జరిగిన అన్యాయాన్ని వారం, వారం అధికారులు నిర్వహిస్తున్న 'స్పందన'లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారుల జాడ కనిపించడం లేదు.

పట్టణ శివారులోని 352 సర్వే నెంబర్‌లో గల భూమి వివాదం నడుస్తోంది. 32 ఏళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న ఆదోని మండలం మండిగిరి పంచాయతీ 352 సర్వే నెంబర్ ప్లాట్ల సమస్య రోజురోజుకు ముదురుతూనే ఉంది. ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి పరిష్కార మార్గం చూపి 421 మందికి న్యాయం చేస్తే నిందలు వేయడం ఏమిటని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వైసిపి నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి ఇటీవల ఆ స్థలంలోనే వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశారు. 352 సర్వే నెంబర్ వివరాలను, కొనుగోలు చేసిన పత్రాలను, జరిగిన అక్రమాలు, బినామీ రిజిస్ట్రేషన్లు, ఒక్కో ప్లాటును రెండు, మూడుసార్లు అమ్మిన వివరాలను వెల్లడించారు.

అక్రమాలకు తెర : 352 సర్వేనెంబర్‌లో హమీద్ అనే వ్యక్తి చంద్రమ్మ అనే మహిళ ద్వారా రెండెకరాల భూమిని కొనుగోలు చేసి ప్లాట్ వేసి 1991లో 73 మందికి విక్రయించినట్లు తెలిసింది. మొదట 73 మందికి ప్లాట్లు అమ్మిన హమీద్ మరోసారి మరో 80 మందికి ప్లాట్లు అమ్ముకుని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించారు. మరోపక్క ఆబిద్ అనే వ్యక్తి 4.24 ఎకరాలను చంద్రమ్మ ద్వారా అగ్రిమెంట్ చేయించుకుని 187 మందికి ప్లాట్లు విక్రయించినట్లు రుజువైంది. అలాగే 2016లో హర్ష అనే వ్యక్తి ఇదే భూమిపై ఎస్‌ఎ చేయించుకుని మళ్లీ ప్లాట్లు వేసి అమ్ముకున్నట్లు సమాచారం. మళ్లీ 2019లో ఎరుకల సూరి అనే వ్యక్తి హమీద్ నుంచి 60 సెంట్ల భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు అమ్ముకున్నారని ఇటీవల విమర్శలు వచ్చాయి. ఈ విధంగా మొత్తం నాలుగు ఎకరాల భూమిలో 421 మంది బాధితులు డబ్బులు కట్టి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.


352 సర్వేనెంబర్ స్థలం ఇదే

కాసులకు కక్కుర్తి : ఒకే భూమిని పేర్లు మార్చి ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చి లేఅవుట్‌కు రెవెన్యూ, ఇతర అధికారులు సహకరించారు. అధికారులు అక్రమాలకు పూర్తిగా సహకరించినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. డబుల్, ట్రిపుల్ రిజిస్ట్రేషన్ చేసి అధికారులు కూడా కాసులకు కక్కుర్తి పడినట్లు తెలిసింది.

కళ్లు మూసుకున్న అధికారులు : పట్టణ శివారులో స్థలం ఉండడం వల్ల ప్రస్తుతం మార్కెట్ విలువ సెంట్ రూ.10 లక్షలు ఉంటుందని పలువురు చెబుతున్నారు. అంత విలువైన స్థలాన్ని ప్రస్తుతం నాయకులు తమ కబంధహస్తాల్లో ఉంచుకొని బాధితులకు న్యాయం చేస్తున్నామంటూ నమ్మబలుకుతున్నారు. కేవలం ప్లాట్ ఒకటిన్నర సెంటు రూ.1.60 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసినట్లు బాధితులు వాపోతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కళ్లు మూసుకొని ఉండడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జరగని న్యాయం : 2019లో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని ఆశ్రయిస్తే ఆయన ఎన్నికల అనంతరం ఈ సమస్యను సిసిఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులందరికీ మార్కెట్ విలువ కాకుండా ఒక్కో ప్లాటును రూ.1.60 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం కుదిర్చి మధ్యవర్తులైన అక్షరశ్రీ రామకృష్ణారెడ్డి ద్వారా చెల్లించే విధంగా లబ్ధిదారుల నుండి డాక్యుమెంట్లు స్వీకరించారని పలువురు చెబుతున్నారు. డాక్యుమెంట్లు సేకరించినా ఇంత వరకు డబ్బులు ఇవ్వలేదని ప్రచారం సాగుతోంది. ఆ స్థలం విలువ రూ.కోట్లలో ఉందని, అవసరమనుకుంటే మరింత కూడా పెంచి బాధితులకు ఇవ్వవచ్చని ఇటీవల టిడిపి నాయకులు ఉమాపతి నాయుడు చేసిన కామెంట్ హాట్ టాపిక్‌గా మారింది. ఎస్సీల భూములను ఉమాపతి నాయుడు కబ్జాకు పాల్పడి అన్యాయం చేశారని ఇటీవల ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మీడియాకు వివరించడంతో రాజకీయంగా దుమారం లేపింది. ఇరువురు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుని ఉంటున్నారే తప్ప బాధితులకు న్యాయం చేయాలని ఎవరి పోరాటం ఉండదని వామపక్ష నాయకులు చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అసలైన లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా చూడాలని కోరుతున్నారు.

విచారణ జరిపించాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి



దశాబ్ద కాలంగా వివాదంలో ఉన్న 352 సర్వే నెంబర్ ఇంటి స్థలాల వివాదాన్ని అధికారులు పరిష్కరించాలి. అసలైన లబ్ధిదారులకు నష్టం వాటిల్లకుండా సమగ్ర విచారణ చేపట్టాలి. ఆ భూమి అక్రమాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల హస్తమున్నట్లు కూడా తెలిసింది. వారిని బాధ్యులను చేసి భూములు కొనుగోలు చేసిన వారికి ప్రస్తుత మార్కెట్ విలువ ఇవ్వాలి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నిష్పక్షపాతంగా న్యాయం చేయాలి. వారి సామాజిక వర్గం వారికే ఆ భూమిని ఇప్పించడం అనుమానాలకు తావిస్తోంది. ఎమ్మెల్యే చిత్తశుద్ధి చాటుకోవాలి.

బాధితులకు అండగా ఉంటాం

- సుదర్శన్, సిపిఐ పట్టణ కార్యదర్శి



పట్టణంలో భూములకు సంబంధించిన ఫిర్యాదులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. బాధితులకు అండగా ఉండాల్సిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల కబ్జాలు పెరిగిపోతున్నాయి. 352 సర్వే నెంబర్‌లో జరిగిన అక్రమాలకు పూర్తి బాధ్యత అధికారులదే. ప్రస్తుతం ఆదోనిలో సబ్ కలెక్టర్ ఉన్నప్పటికీ అలాంటి వివాదస్పదమైన భూముల విషయాలు పరిశీలించి న్యాయం చేయాల్సింది పోయి చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. బాధితులకు మేము అండగా ఉంటాం. ముందుకొస్తే అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

'ఎబిసి కాలువకు సాగునీరందించాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

తుంగభద్ర జలాశయ విభాగంలోని ఆలూరు బ్రాంచి కాలువకు జనవరి చివరి వరకు సాగు, తాగునీరందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించినట్లు ఎంపిపి దంపతులు జూటూరు హేమలత మారయ్య తెలిపారు. గురువారం చిప్పగిరిలో ఎంపిపి, ఆమె భర్త మారయ్య మాట్లాడారు. ఆలూరు బ్రాంచి కెనాల్ రైతుల సమస్యలను కార్మిక శాఖ మంత్రి జయరాం సమక్షంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆలూరు బ్రాంచి కాలువ కింద 14 వేల హెక్టార్లకు పైగా పంటలు సాగు చేశారని చెప్పారు. నీరు అరకొరగా అందడంతో ఇబ్బందులు పడుతూ రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయి ఆత్మహత్యలే శరణ్యమంటున్నారని తెలిపారు. హంద్రీ కాలువ నుంచి ఆలూరు బ్రాంచి కాలువకు సాగు, తాగునీరు విడుదలయ్యే విధంగా చూడాలని కోరినట్లు చెప్పారు. స్పందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జనవరి చివరి వరకు సాగు, తాగునీరందే విధంగా చర్యలు తీసుకోవాలని అక్కడ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వైసిపి యువ నాయకులు ధనుంజయ, లాల్ స్వామి, లింగన్న పాల్గొన్నారు.



స్కంధ మాత అలంకారంలో అమ్మవారు

ఆలూరు : దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యక పరమేశ్వరి దేవి ఆలయంలో గురువారం స్కంధ మాత అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, మహ మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను అర్చకులు నరేంద్ర శాస్త్రీ చేశారు. దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జనార్ధన్ శెట్టి, భాస్కర్ శెట్టి, సభ్యులు విశ్వనాథ్ శెట్టి, సతీష్ కుమార్, శివప్రసాద్ శెట్టి, హరికృష్ణ, రవి, సుబ్బయ్య శెట్టి, చంద్రశేఖర్ శెట్టి, నాగేంద్ర శెట్టి పాల్గొన్నారు.

కడిగిన ముత్యంలా వస్తారు...

- టిడిపి ఆదోని, మంత్రాలయం ఇన్‌ఛార్జీలు
- చంద్రబాబుకు మద్దతుగా పాదయాత్ర

ప్రజాశక్తి - ఆదోని/కౌతాళం

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు అయిన చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకొస్తారని టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. గురువారం చంద్రబాబుకు మద్దతుగా ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు నాయకత్వంలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఆదోని ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి పాదయాత్ర మొదలైంది. కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వరకు సాగింది. ముందుగా ఆదోని పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పాదయాత్రగా కడితోట, గనేకల్లు, పాండవగల్, ఎరిగేరి, కామవరం మీదుగా ఉరుకుందకు చేరుకున్నారు. కడితోట బైపాస్ రోడ్డులో వెలసిన దాదా పీర్ సాహెబ్ దర్గాలో దర్గా పీఠాధిపతి బాషా పీర్ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును వైసిపి ప్రభుత్వం ఆధారాలు లేని కేసులతో అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. 30 కిలోమీటర్లు పాదయాత్రతో బయల్దేరి ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తన అనుచరులతో ఎరిగేరి గ్రామం నుంచి పాదయాత్రలో భాగస్వాములయ్యారు. టిడిపి నాయకులు బుద్ధారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లూరి వెంకటపతి రాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ కొత్రేష్ గౌడ్, ఎల్లారెడ్డి, మైనారిటీ సంఘం రాష్ట్ర నాయకులు సాయిబాబా, కురుగోడు, టిప్పు సుల్తాన్, రమేష్ గౌడ్, వెంకటరెడ్డి, శివమూర్తి, ఎరిగేరి బసవరాజు, సురేంద్ర, సిద్ధు, రాజాబాబు, శివప్ప గౌడ్, రంగస్వామి నాయుడు, సాయిబాబా, రామకృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.


పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న తిక్కారెడ్డి

గత వైభవం తెస్తాం : కాంగ్రెస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కాంగ్రెస్‌కు గత వైభవాన్ని తెచ్చేందుకు ప్రతి కార్యకర్తా సైనికునిలా పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. రాహుల్ గాంధీ జోడోయాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ మైనారిటీ విభాగ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం పట్టణంలోని చిన్న మార్కెట్ మీదుగా ప్రభుత్వ మహిళ హాస్పిటల్ నుంచి ఎమ్మిగనూరు క్రాస్ రోడ్డు, ఆస్పరి రోడ్డు వరకు జెండాలు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. అనంతరం జీవనజ్యోతి ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనారిటీ విభాగ జిల్లా అధ్యక్షులు ఎమ్ఎమ్‌డి.నూర్ మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రతో కాంగ్రెస్‌కు దశ దిశ తిరిగిందని తెలిపారు. ఎస్సీ సెల్ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి తాయన్న, మైనారిటీ విభాగ జిల్లా ఉపాధ్యక్షులు వలీబాష, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాద్రీ బాష, జిల్లా కార్యదర్శి అహ్మద్, మండల అధ్యక్షులు అయ్యన్న, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెట్టేకల్లు, హనుమంతు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చమంటే అరెస్టులా

- జనసేన సీనియర్ నాయకులు చల్లాశ్రీ వరుణ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

హామీలను నెరవేర్చాలని కోరితే అరెస్టు చేస్తారా అంటూ జనసేన సీనియర్ నాయకులు చల్లాశ్రీ వరుణ్ మండిపడ్డారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న చల్లాశ్రీ వరుణ్‌ను, ఆయన అనుచరులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

నిధుల కేటాయింపు హర్షణీయం

- సర్పంచి అరుణ్‌కుమార్

దేవనకొండ : గంజిహళ్లి - తెర్నేకల్ గ్రామ మధ్యలోని హంద్రీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.47 కోట్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులో జరిగిన 'జగనన్న చేదోడు'లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి అభ్యర్థన మేరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు, దేవనకొండ మండల ప్రజల రాకపోకలకు బ్రిడ్జి నిర్మాణ రహదారి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజలు ముఖ్యమంత్రికి, మంత్రి జయరామ్‌కు, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయి

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కా రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మచ్చ లేని నాయకుడు చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందుతున్న జగన్మోహన్ రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉరుకుంద గ్రామంలో 'బాబుతో నేను' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మండల నాయకులు చెన్నబసప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు కొత్రేష్ గౌడ్, అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, సీనియర్ నాయకులు సాయిబాబా, టిప్పు సుల్తాన్, రమేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, శివప్ప గౌడ్, రాజాబాబు పాల్గొన్నారు. **కోసిగి** దుర్గ నగర్ 8వ వార్డులో 'బాబుతో నేను' నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బాబు అక్రమ అరెస్టును నిరసించారు. మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం తపించే చంద్రబాబుపై రాజకీయ కక్షతో అక్రమ కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర, నియోజకవర్గాన్ని అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని తెలిపారు. టిడిపి మండల నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, కోడి పెద్ద ఈరన్న, కోడి ఉరుకుందప్ప, ఎస్.ఉరుకుందప్ప, కొండగేని వీరారెడ్డి, దుబ్బ వీరారెడ్డి, రంగడు, మహాదేవ, మారెప్ప, డీలర్ నరసన్న, బెళగల్ గోపాల్ పాల్గొన్నారు.


కోసిగిలో మాట్లాడుతున్న తిక్కా రెడ్డి

ప్రాథమిక హక్కులను హరించడం దారుణం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కూడా హరించడం దారుణమని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ విమర్శించారు. గురువారం ఆదోని 3వ పట్టణ పోలీసులు గుడిసె కృష్ణమ్మను గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సభలో నిరసన తెలియజేయడాన్ని అడ్డుకున్నారన్నారు. పోలీసులు వైసిపికి వత్తాసు పలకడంపై ఆమె ధ్వజమెత్తారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డెమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, గిరిధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పట్టణంలోని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులును బుధవారం రాత్రి వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసులు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని నిర్బంధించడం సమంజసం కాదంటూ నాయకులు తెలిపారు. హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్ పర్యటన చేయడం ఏమిటని శ్రీనివాసులు ప్రశ్నించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా టిడిపి, వామపక్ష, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేశామని డీఎస్పీ శివ నారాయణ స్వామి గురువారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని ఈదుల దేవరబండ, మాచాపురం గ్రామ రహదారి మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గోనెగండ్ల మండలం వెముగోడు గ్రామానికి చెందిన మాబుసాబ్ అలియాస్ దుబ్బ మాబు (64), ఇబ్రహీం (50)లు పత్తికొండకు వెళ్లి వ్యక్తిగత పనులు ముగించుకుని స్వగ్రామానికి మోటార్ బైక్‌పై బయల్దేరారు. కర్నూలు నుంచి బళ్లారి వైపు ఎదురుగా వస్తున్న బోలేరో వాహనం మోటారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న మాబు, ఇబ్రహీం గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దుబ్బ మాబు శుభకార్యాల్లో డోలు వాయిస్తూ, కవాలి పాటలు పాడడం, హాస్యం చేయడంలో మంచి పేరు కలిగిన వ్యక్తి. ఆయన మృతితో కుటుంబ సభ్యుల్లో, మిత్రుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.


'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు వైద్యం

- సర్పంచి ప్రహ్లాద యాదవ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా పేదలందరికీ ఉచితంగా వైద్యం అందిస్తున్న సర్పంచి ప్రహ్లాద యాదవ్ తెలిపారు. గురువారం మండలంలోని విరుపాపురం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి ఆరుమణమ్మ, సర్పంచి ప్రహ్లాద యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆశయాలను నెరవేర్చడం, రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి గడపకు వైద్యం అందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' చేపట్టారని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, ఎమ్మెల్యేగా సాయిప్రసాద్ రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎంపిటిసి శివకుమార్, డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ సుస్మిత, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ సురేష్, ఇన్‌ఛార్జీ సిడిపిఒ సావిత్రి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం దౌల్తాపురం గ్రామంలో సర్పంచి లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు సుధీర్, సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. కర్నూలు నుంచి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్లు సుప్రవల్లిక, మురళీ మోహన్, సౌరబ్, శేఖర్, జమీల్ అహ్మద్ 330 మంది మహిళలకు, పురుషులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్స్ ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సర్పంచి లక్ష్మీదేవమ్మ, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ప్రభుత్వ వైద్యాధికారి జమీల్ అహ్మద్, ఎంపిడిఒ కొండయ్య, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు పెద్ద షేకన్న, దామోదర, చిన్న షేకన్న, తిమ్మప్ప, డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్, మహిళ సంరక్షకులు గౌరీ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని కారుమంచి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి లక్ష్మి, వైస్ ఎంపిపి చంద్రకళ మాట్లాడారు. కుటుంబంలోని ప్రతిఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'ఆరోగ్య సురక్ష'ను తీసుకొచ్చారన్నారు. డాక్టర్ రఘురామ్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో 464 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. స్పెషలిస్టులు గీతావాణి, మాధవి లత, డాక్టర్లు శశి కిరణ్, బాలకృష్ణా రెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, వైసిపి నాయకులు కౌలుట్ల, రాజన్న గౌడ్ పాల్గొన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న సర్పంచి ప్రహ్లాద యాదవ్





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం కార్యక్రమాన్ని తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

ఒపిఎస్‌నే అమలు చేయాలి

- యుటిఎఫ్ నేతలు డిమాండ్
- బొమ్మలసత్రం వద్ద నిరవధిక దీక్షలు



సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నంద్యాల

సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పివి.ప్రసాద్, సుధాకర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం నంద్యాలలోని బొమ్మల సత్రం వద్ద ఉదయం 10 గంటల నుండి యుటిఎఫ్ జిల్లా శాఖ అధ్వర్యంలో ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర నాయకత్వం విజయవాడలోనియుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఈ నెల 18వ తేదీ నుండి నిరవధిక దీక్షలకు చేపడుతున్నట్లు చెప్పారు. 19వ తేదీ అన్ని జిల్లాల్లో జిల్లా నాయకత్వం, 20వ తేదీ తాలూకా డివిజన్ కేంద్రాలలో, 21వ తేదీ అన్ని మండల కేంద్రాల్లో మండల నాయకత్వం, కార్యకర్తలు దీక్షలకు కూర్చుంటున్నట్లు చెప్పారు. ఈ దీక్షలలో సిపిఎస్ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1.9.2004 ముందు నియామక ప్రక్రియ పూర్తి చేసుకున్న 11 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఈ దీక్షలకు మద్దతుగా ఉపాధ్యాయ సంఘం, ఉద్యోగ, సిపిఎస్ సంఘాలు, జెఎసి, ప్రజాసంఘాలు తదితర నాయకత్వాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అనేకమంది ఈ ఉద్యమంలో పాల్గొని ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ని సాధించేవరకు కలిసి పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్య ప్రకాష్, రామ్ మోహన్, రామ కృష్ణుడు, బాల స్వామి, అరవింద్, వేంకటేశ్వర రెడ్డి, ప్రతాప్, రామకృష్ణా రెడ్డి, గోపాల్, జాన్ సన్, మధు, రవి, రమణ, రామ్ నాయక్, వేంక టేశ్వర్లు, రామకృష్ణ, లింగమయ్య, శ్రీనివాసులు, పూజారి శ్రీనివాసులు, గోపాల్, నాగమయ్య, సోమయ్య, ఫిదా హుస్సేన్, మల్లిఖార్జునప్ప, బనగాన పల్లె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

14,304 మందికి 'జగనన్న చేదోడు'

- లబ్ధిదారుల ఖాతాలలో రూ. 14.30 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 14,304 మంది అర్హులైన లబ్ధిదారుల ఖాతాలలో రూ. 14 కోట్ల 30 లక్షల 40 వేలు రాష్ట్ర ముఖ్యమంత్రి బటన్ నొక్కి జమ చేశారని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గ కేంద్రం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న చేదోడు పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 3,25,020 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలకు రూ.325.02 కోట్ల ఆర్థిక సహాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా నంద్యాలలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రజక సంఘ డైరెక్టర్ వెంకటలక్ష్మి తదితరులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద నాల్గవ విడతలో ఒక్కక్కరికి 10 వేల రూపాయల చొప్పున 14,304 మంది అర్హులైన లబ్ధిదారుల ఖాతాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2820 మంది లబ్ధిదారులకు రూ. 2 కోట్ల 82 లక్షలు, బనగానపల్లెలో 3163 మందికి రూ. 3 కోట్ల 16 లక్షల 30 వేలు, డోన్‌లో 1687 మందికి రూ.1 కోటీ 68 లక్షల 70 వేలు, నందికొట్కూరులో 1417 మందికి రూ.1 కోటీ 41 లక్షల 70 వేలు, నంద్యాలలో 2999 మందికి రూ. 2 కోట్ల 99 లక్షల 90 వేలు, శ్రీశైలంలో 1519 మందికి రూ. 1 కోటీ 51 లక్షల 90 వేలు, పాణ్యంలో 699 మందికి రూ. 69 లక్షల 90 వేలు జమ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద మెగా చెక్కును జిల్లా కలెక్టర్, బెస్త సంక్షేమ సంఘ డైరెక్టర్, రజక సంఘ డైరెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.

స్కందమాతగా అమ్మవారు

- శేష వాహనంపై స్వామి అమ్మవార్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో జరుగుతున్న మహోత్సవాల్లో గురువారం స్కందమాత అలంకారంలో అమ్మవారు, శేష వాహనంపై స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఐదవ రోజు అమ్మవారికి స్కందమాత అలంకారంలో అలంకరించి, స్వామి అమ్మవార్లను శేష వాహనంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం నుండి అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, రుద్రహెూమం, చండీహెూమం, చతుర్వేద పారాయణలు, రుద్రపారా యణ, చండీపారాయణ, జపానుష్ఠానాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 9 గంటల నుండి కాళ రాత్రి పూజలు చేశారు. అమ్మవారికి ఆస్థాన సేవ, సువాసిని పూజలు నిర్వహించారు.

గ్రామోత్సవం : స్కంద మాత అలంకారంలో ఉన్న అమ్మవారిని, శేష వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను వివిధ రకాల కళా నృత్య ప్రదర్శనలతో ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింప చేసి రథశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథశాల వద్ద నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామి వరకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, కోలాటం, చెక్కభజన, తప్పెటచిందు వంటి కళా నృత్య ప్రదర్శనలు, వేదమంత్రాలు మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. **బనగానపల్లె :** మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్కందమాత అలంకరణలో అమ్మవారు, శేష వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

తుది దశకు అభివృద్ధి పనులు

- డిసెంబర్ కల్లా పూర్తి చేయాలి
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరాయని, డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ముఖ్యమంత్రి ఎమ్మిగనూరు పర్యటన ముగిశాక మంత్రి బుగ్గన బేతంచెర్ల పట్టణంలోని అభివృద్ధి పనులను పరిశీలించారు. 110 గదులతో నిర్మిస్తున్న బిసి రెసిడెన్షి యల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణాలను పరిశీలించారు. రూ.36 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నిర్మాణంలో ఇప్పటికే డైనింగ్ బ్లాక్, రూఫ్ స్లాబ్, ప్లాస్టెరింగ్, హాస్టల్ బ్లాక్-2 సహా కీలక పనులు పూర్తయినట్లు మంత్రి బుగ్గన వెల్లడించారు. మిగతా పనులు కూడా మరింత త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఐటిఐ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వారికి, వివిధ వృత్తి పనుల వారికి నైపుణ్య అభివృద్ధి శిక్షణను ఇచ్చే ఎంఎస్ఎంఇ సెంటర్‌నూ మంత్రి పరిశీలించారు. రూ.4 కోట్లతో నిర్మిస్తోన్న ఈ భవనంలో ఇప్పటికే అడ్మిన్ బ్లాక్, వర్క్ షాప్ స్లాబ్ పనులు సహా సింహభాగం పనులు పూర్తయినట్లు మంత్రి వివరించారు. రూ.7.8 కోట్లతో నిర్మిస్తోన్న ఐటీఐ కాలేజీ పనులు చురుకుగా జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పనులన్నీ డిసెంబర్ నెల కల్లా పూర్తి చేయాలని ఆర్థిక మంత్రి ఆదేశించారు. ఈ కాలేజీలో అత్యాధునిక సదుపాయాలైన యంత్రాలు, పరికరాలు, సామాగ్రి కోసం మరో రూ.3 కోట్ల నిధులను ఇప్పటికే మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలో రూ.80 లక్షలతో కొత్తగా నిర్మిస్తోన్న ఆర్ అండ్ బి ఇన్స్‌పెక్షన్ బంగ్లా పనులను మంత్రి పరిశీలించారు.



బిసి రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, ఎంఎస్ఎంఇ, ఐటిఐ కాలేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో పంటలు వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నష్టపరిహారం కింద ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్యాపిలి మండలంలో ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి హయాంలో రైతుల పరిస్థితి అయోమయంగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వలసలుగా ఇతర రాష్ట్రాలకి సాగుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలను తీసుకోవడం లేదని చెప్పారు. ఎమ్మిగనూరులో జరిగిన సిఎం బహిరంగ సభలో రైతులను ఆదుకుంటారని, హామీ ఇస్తారని ఆశించినప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం పట్ల ఆయన వైఖరి ఏమిటో అర్థమవుతుందని అన్నారు. డోన్ నియోజవర్గంలో 106 చెరువులకు నీళ్ల నింపకుండా కేవలం ప్రారంభోత్సవాల ప్రచారానికే పరిమితం చేశారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను కలుపుకొని రాష్ట్రంలో ఎక్కడ కూడా ముఖ్యమంత్రిని తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, మోటార్ రాముడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారుమంచి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, జిల్లా కోశాధికారి సురేష్, మండల కార్యదర్శి వెంకటేష్, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టమోటా పంటను పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



టిడిపి నాయకున్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

టిడిపి నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని కాపులపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు యడమకంటి పెద్దిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి గురువారం పరామర్శించారు. పెద్ది రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి సర్పంచి తులసి రెడ్డి ,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చరిత్ర మరిచిన సిఎం జగన్

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న గడ్డం రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చరిత్రను మరిచిపోయి న్యాయానికి సంకెళ్లు వేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1975 నుండి 77 వరకు దేశంలో ఎమర్జెన్సీని విధించి దాని పర్యవసానంగా అధికారం కోల్పోయారని చెప్పారు. 1889లో అప్పటి డిఎంపి నేతలు జయలలితను నిండు సభలో అవమానించి తర్వాత ఎన్నికల్లో అధికారం కోల్పోయా రన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి అన్యాయంగా చేసిన చర్యల ద్వారా వైనాట్ 175 కాదు వైనాట్ పులివెందుల అనేలా సొంత రాష్ట్ర ప్రజలే రాబోవు ఎన్నికలలో ఓటు రూపంలో చూపించబోతున్నారనేది మర్చిపోవద్దన్నారు. రోజురోజుకీ అధికార పక్షం గ్రాఫ్ పడిపోయి ప్రతిపక్షం విజయానికి దగ్గరవుతుందనే సత్యాన్ని వైసిపి ప్రభుత్వం మర్చిపోవద్దన్నారు.

గ్రంధాలయంలో దసరా విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని గ్రంధాలయంలో దసరా విజ్ఞాన శిబిరాన్ని గ్రంధాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయివేటు పాఠశాల టీచర్ హుస్సేన్ భాషా మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన బాండాగారమని, గ్రంధాలయంలో అనేక విషయాలు విద్యార్థిని విద్యార్థులు తెలుసుకొని జీవితంలో ముందుకు సాగాలని తెలిపారు. గ్రంధాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులలో పిల్లలను పంపేలా చర్యలు చేపట్టాలని తెలియజేసినా హాజరు కాలేకపోయారని తెలిపారు. ఒక ప్రైవేటు ఉపాధ్యాయుడు తన ట్యూషన్ పిల్లలను తీసుకొచ్చి పిల్లలకు గ్రంధాలయాలపై ఒక అవేర్నెస్ కల్పించడం పట్ల ఆయనను అభినందించారు.


వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైద్యం, వ్యవసాయ రంగాలకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో రూ. 40 లక్షల 30 వేలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్ఆర్ యంత్రసేవ పథకం ద్వారా రైతు సంఘాలకు ప్రభుత్వ సబ్సిడీపై ట్రాక్టర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలనే లక్ష్యంగా జగనన్న పని చేస్తున్నట్లు చెప్పారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎంగా చేసుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, తహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ఇల్లూరు కొత్తపేట గ్రామ సర్పంచి గోగుల రమణ, వైసిపి నాయకులు బాలిరెడ్డి, రాఘవరెడ్డి, బి.వి. సుబ్బారెడ్డి, కాపులపల్లి కొండారెడ్డి, కాపులపల్లె వెంకటేశ్వర్లు, కాపులపల్లె మహేష్, తోకల నారాయణ, మిట్టపల్లి రామకృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీ నాయక్, టంగుటూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు, డాక్టర్ సోహెల్, వైద్య సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - రుద్రవరం : ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కషి చేయాలని ఎంపిపి మబ్బు బాలస్వామి సూచించారు. గురవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఒ మధుసూదన రెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో ఎంపిడిఒ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కోటయ్య, విద్యుత్ శాఖ ఏఈ రాఘవేంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ ఏవో శ్రీకీష్ణ, పశు వైద్య శాఖ వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ప్రమోద్‌తోపాటు ఆయా శాఖల అధికరులు తమ శాఖల పరిధిలో గ్రామాలలో జరిగిన అభివృద్ధిపై వివరించారు. గ్రామాలలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, ప్రజారోగ్యం వంటి ప్రధాన అంశాలపై సర్పంచులు, ఎంపిటిసిలు సభ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని ఎంపిడిఒ ప్రజా ప్రతినిధులకు వివరించారు. అధికారులు, సిబ్బంది ప్రణాళికలు రూపొందించుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏడిఏ గిడ్డయ్య, తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవోదయలో 9, 11వ తరగతులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : వచ్చే విద్యా సంవత్సరం 2024-2025లో జవహర్ నవోదయ విద్యాలయ, బనవాసి, ఎమ్మిగనూరు మండలంలో 9వ, 11వ తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నంద్యాల జిల్లాలలోని అభ్యర్థులు మాత్రమే అర్హులని, వెబ్‌సైట్ https://navodaya.gov.in ద్వారా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేది లోపల చేసుకోవాలని, ఎంపిక పరీక్ష 2024 ఫిబ్రవరి 10న ఉంటుందని తెలిపారు.

ముస్లిం రచయితల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల : ముస్లిం రచయితల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం (మురసం) సమావేశం చాంద్‌బాడాలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో గురువారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రచయిత షేక్ అబ్దుల్ సమద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం రచయితల సంఘం పరిచయం చేస్తూ మురసం అన్ని మతాలకు, కులాలకు, సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే నిజమైన సెక్యులర్ రాజ్యం, సామాజిక, ఆర్థిక సమానత్వం కోరుకుంటుందని తెలిపారు. మహిళల హక్కుల కోసం మురసం మాట్లాడటమే కాదు వేదికలపై మహిళా ప్రాతినిధ్యం ఇస్తుందన్నారు. జిల్లా కార్యవర్గం పదవీ కాలం రెండేళ్ళు ఉంటుందని, మురసం సభ్యులు భారత రాజ్యాంగ విలువలకు, లౌకిక ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉంటారని వివరించారు. రంజాన్‌లో కవి సమ్మేళనం, సంకలనాలు, అబాబీల్, కథలు, వ్యాస రచన ప్రక్రియలు నిర్వహిస్తుందన్నారు. కమిటీ గౌరవ సాహితీ సలహాదారుగా ఎస్.ముర్తుజా విద్వాన్, అధ్యక్షులుగా ఎంఎండి.రఫీ, ఉపాధ్యక్షులుగా ఎస్ఎండి కరీముద్దీన్, అబ్దుల్ ఆజాద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ బాషా, సహాయ కార్యదర్శిగా ఎంఎండి రఫీ, కోశాధికారిగా ఎస్ఎండి ఫయాజ్‌తో పాటు కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాష్టికాన్ని ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇజ్రాయిల్ రాజ్య కాంక్షతో మానవత్వాన్ని మరిచి చిన్నపిల్లలను సైతం పొట్టన పెట్టుకుంటుందని, ప్రపంచ జనావళి ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని కోరారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం : మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రైతులను ఇబ్బంది పెడితే సహించబోమని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. కెసి కాల్వకు నీళ్ల రాక ఇబ్బంది పడుతున్నామని రైతులు మాజీ మంత్రి భూమా అఖిలప్రియను కలిసి విన్నవించారు. దీంతో అఖిల ప్రియ వెంటనే స్పందించి రైతులతో కలిసి దొర్నిపాడు నుంచి గోస్పాడు మండలం యాలూరు వరకు కెసి కాలువ వెంట తిరిగి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కెసి కెనాల్‌కు సంబంధించిన అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి వరకు రైతులకు కరెంటు కోతలు లేకుండా, సాగు నీటి సమస్య లేకుండా చేయాలన్నారు. ప్రతి రైతు పండిస్తున్న పంటకు నీరు అందించాలని, ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు యామగురప్ప, శ్రీకాంత్ రెడ్డి, సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కెసి కెనాల్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ



ఫిల్టర్ వాటర్ మిషన్లను ప్రారంభిస్తున్న మూడో ఆదనపు జిల్లా జడ్జి వాసు

కోర్టులో ఫిల్టర్ వాటర్ మిషన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - నంద్యాల లీగల్

నంద్యాల కోర్టు భవనాల సముదాయంలో ఏర్పాటు చేసిన మూడు ఫిల్టర్ వాటర్ మిషన్లను మూడో ఆదనపు జిల్లా జడ్జి వాసు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది ఇసుకపల్లి గురుమూర్తి జ్ఞాపకార్థం వారి శిష్యుడు ప్రస్తుత నంద్యాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గొల్ల జయ కృష్ణ సొంత ఖర్చులతో వాటర్ ఫిల్టర్ మిషన్లను మూడు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రతాపరెడ్డి, రవికుమార్, నందం బాబురావు, ప్రసాద రెడ్డి, జూనియర్, సీనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేడు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలపై దరఖాస్తులను నేడు ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 1-30 వరకు అందజేయవచ్చని తెలిపారు. ప్రతి ఉద్యోగి దరఖాస్తులో సిఎఫ్ఎంఎస్ ఐడి తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

సౌత్‌జోన్ టెన్నిస్ పోటీలకు శాంతిరాం విద్యార్థిని

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని నెరవాడ సమీపంలోని శాంతిరామ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని ఏ.ప్రవల్లిక సౌత్ జోన్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి మధుసూదన శెట్టి తెలిపారు. గురువారం కళాశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి. మునిశంకర్ మాట్లాడుతూ ఈనెల 18న జెఎన్‌టియు కళాశాలలో సౌత్ జోన్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించారని, ఈ పోటీలలో బీ.ఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యార్థిని ఏ.ప్రవల్లిక అత్యంత ప్రతిభ కనబరిచి ఎంపికయినట్లు చెప్పారు. ఈ పోటీలలో ఎంపికైన జట్టు నవంబర్ 8 నుండి 10 వరకు జైన్ యూనివర్సిటీ (బెంగళూరు)లో జరిగే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్జీఎం గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఎండి. మిద్దె శివరాం క్రీడాకారిణిని అభినందించారు.


పూజల నిర్వహిస్తున్న ఉబయదారులు


గాయత్రీదేవిగా కాళికామాత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్‌లో వెలిసిన కాళికామాత ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు గురువారం కాళికామాత అమ్మవారిని గాయత్రీదేవి అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ చక్రానికి కుంకుమార్చనలు చేశారు. కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షులు శిల్పి దురుగడ్డ రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

అవుకు : పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం వాసవి మాత మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వాసవి మాతను చల్లా కుటుంబం దర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలసిన తకన్యకా పరమేశ్వరి అమ్మవారు శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం ధనలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాదంశెట్టి వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ శ్రీరామ సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, గౌరవ సలహాదారులు గాదంశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లగట్ల శివయ్య, సెక్రటరీ గూండా రవికుమార్, గుండా శ్రీనివాసులు, బింగిమల్ల హనుమాన్, జక్కా నాగరాజు, నల్లగట్ల వెంకటేశ్వర్ల, పిఎస్ఎన్ సత్యం, నూకల సుబ్బయ్య, టంగుటూరు శీనయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్యాపిలి : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దసరా నవరాత్రుల సందర్భంలో భాగంగా అమ్మవారు ఐదవరోజు శ్రీలలిత త్రిపుర బాలసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షు లు మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు బైసాని సురేష్, కార్యదర్శులు ఇస్కాల మురళి, జొన్నలగడ్డ హరి, శేషఫణి, బైసానిగిరి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మండల అధ్యక్షుడుగా దామోదర్ నాయుడు

ప్రజాశక్తి -ప్యాపిలి

చంద్రపల్లి గ్రామానికి చెందిన దామోదర్ నాయుడు బిజెపి ప్యాపిలి మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి శభరి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన బిజెపి కార్యకర్తల సమావేశంలో దామోదర్ నాయుడు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే

గప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎంపీడీవో శివరామయ్య, తహశీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, టంగుటూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు, డాక్టర్ సోహెల్, గ్రామ సర్పంచి గోగుల రమణ, పంచాయతీ సెక్రెటరీ నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **ప్యాపిలి :** ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష అని జడ్పిటీసీ బోరెడ్డి శ్రీరామరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ప్యాపిలిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవో శివకుమార్ గౌడ్,డాక్టర్లు నుశ్రత్,నితీష్,రమ్య శిల్ప సిబ్బంది పాల్గొన్నారు. **బేతంచర్ల :** రాష్ట్ర క్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బేతంచర్ల పట్టణంలోని అల్లా బకాష్ దర్గా, డ్రైవర్స్ కాలనీలో నిర్మింపబడిన ఆరోగ్య ఉప కేంద్రం నందు, ఆర్ కొత్తపల్లి గ్రామం నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, కొత్తపల్లి ఎంపీటీసీ మునీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి, ఎంపీటీసీ మునీశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ మహాలక్ష్మి, డాక్టర్ సాగరిక,గూని నాగరాజు, ఎద్దులన్న, రాజు తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** పేదలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తోందని ప్రజలందరూ ఉపయోగిం చుకోవాలని సర్పంచ్‌లు గోవిందయ్య, శంకరమ్మలు తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు 2వ సచివాలయం ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సచివాలయ పరధిలోని తోడేండ్లపల్లె, చక్రవర్తుల పల్లె, ఎంతాండా గ్రామాల ప్రజలకు వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసారు. అనంతరం గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఎంపీడీవో మహబూబ్ దౌలా,,హెల్త్ ఎడ్యుకేటర్ రత్నాలు, ఎంపిహెచ్ఓ వెంకటేశ్వర్లు,ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుశీలమ్మ, పంచాయతి కార్యదర్శి దాసు, నీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, అంకాల్ రెడ్డి, గిరిరాజా తదితరులు పాల్గొన్నారు.


రోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


కంటి అద్దాలను అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన


ప్యాపిలి : మాట్లాడుతున్న జడ్పిటిసి శ్రీరామరెడ్డి


బండి ఆత్మకూర్ : మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూర్ : మండలంలోని ముష్టి పల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో మోహన్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార స్టాల్ ఏర్పాటు చేశారు.

బండి ఆత్మకూర్ : మండలంలోని జి లింగాపురంలో సర్పంచ్ సన్నాల రాధమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐటిడిఏ పిఓ డాక్టర్ రవీంద్ర రెడ్డి హాజరైయ్యారు. ఈసందర్భంగా పిఓ మాట్లాడుతూ చెంచులకు మెరుగైన వైద్యం కోసం ఎంత ఖర్చైనా ఐటీడీఏ భరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ్ గుప్తా, వైకాపా నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాములపాడు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సంఘం వెంకటేశ్వరరావు, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు సామన్న డిమాండ్ చేశారు. పాములపాడు మండలంలోని చెలిమిల్ల గ్రామంలో మొక్కజొన్న ధాన్యాన్ని రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాములపాడు మండలంలో ఖరీఫ్ సీజన్లో వర్షపాతం సరిగాలేక అరకొరగా పండిన ధాన్యాన్నికి కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా మద్దతు ధర కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళారులు రైతులు పండించిన మొక్కజొన్న పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు రైతులకు అండగా ఉంటామని ఊపదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు తప్ప రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కృష్ణారెడ్డి, శంకర్, మల్లికార్జున, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు


సిఎంను కలిసిన ప్రభుత్వ సలహాదారులు గంగుల, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి


సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

సిఎంను కలిసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కర్నూల్ ఓర్వకల్లు విమానాశ్రయంలో గురువారం ఎపి జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్రా రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఉన్నారు.

నందికొట్కూరు టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఓర్వకల్ ఎయిర్ పోర్ట్‌లో నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని అత్యవసర సమస్యలను నివేదికల రూపంలో సిఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి పౌరుడు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి ఎపి సెక్రటేరియట్ నుండి వర్చువల్ విధానంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రాధాన్యత భవనాలు, గృహ నిర్మాణాలు, గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే, బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌తో పాటు జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకునేలా వాలంటీర్ల ద్వారా విస్తత ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా, సిపిఓ వేణుగోపాల్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విజయం

ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల

క్రీడాకారులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే విజయం వరిస్తుందని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి అన్నారు. గురువారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో జట్టు శిక్షణ శిబిరం ముగిసింది. జడ్పిటిసి పుల్యాల దివ్య, ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి దంపతుల కుమారుడు పుల్యాల చరణ్ రెడ్డి గత సంవత్సరం మృతిచెందారు. ఈ మేరకు కీర్తిశేషులు పుల్యాల చరణ్ రెడ్డి జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయిలో ఖోఖో పోటీలలో పాల్గొని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో జట్టుకు, శిక్షణలో పాల్గొన్న 32 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను పుల్యాల నాగిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణతో పాటు పట్టుదల ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే విజయం వరిస్తుందన్నారు. ప్రతి క్రీడాకారునికి ముఖ్యంగా ఉండవలసింది క్రీడా స్ఫూర్తి అన్నారు. ఓటమి చెందినప్పుడు కృంగిపోవడం, విజయం వరించినప్పుడు అతి ఉత్సాహం చూపినప్పుడే క్రీడా జీవితానికి ముప్పు వస్తుందన్నారు. ఓటమిని, గెలుపును సమానంగా స్వీకరించినప్పుడే విజయం తనంతట తానే వరిస్తుందన్నారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొని విజయం సాధించి కప్పు గెలుచుకొని జిల్లాకు మంచిపేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, గ్రామ పెద్దలు నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మద్దిలేటి రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కష్ణ, చక్రపాణి, శ్రీధర్ కుమార్, రాగన్న, క్రీడా శ్రీ తోకల పితాంబ రెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పుల్యాల నాగిరెడ్డి


పనులను పరిశీలిస్తున్న సప్తశైల రాజేష్ రాజేష్

అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయం

డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ మున్సిపాలిటీలో ఉన్న ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. డోన్ పట్టణంలోని 4 వార్డు నందు చేపట్టినటువంటి సిసి డ్రైన్,సిసిరోడ్లు,సీసీ కల్వట్లు, పనులను మున్సిపల్ చైర్మన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో స్పెషల్ గ్రాంట్ కింద నిధులు మంజూరు చేయించి వార్డుల అభివృద్ధికి దోహద పడేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్లు హరికిషన్ జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్ సుబ్బలక్ష్మి,దినేష్ గౌడ్ మున్సిపల్ ఏ ఈ సురేష్,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పురప్రముఖులు అలా సాయి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

- మంత్రి బుగ్గనను కలిసిన వడ్డెరలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెరలు కోరారు. గురువారం బేతంచెర్లలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డిని బేతంచెర్ల వడ్డెర సంఘం నాయకులు మంత్రి స్వగృహంలో కలిశారు. శ్రీ శైల దేవస్థానం అఖిల భారత వడ్డె వడ్డెర వడియారాజుల నిత్యాన్నదాన సత్రం కమిటీ సభ్యుడు మక్కల సుబ్బరాయుడు మంత్రితో మాట్లాడుతూ వడ్డెరలను బిసి-ఎ నుండి ఎస్టీ జాబితాలో చేర్చుటకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాని కోరారు. వడ్డెరలు అన్ని రంగాలలో వెనుక పడి ఉన్నారనిఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తే అభివృద్ధి చెందుతారన్నారు. 50 సంవత్సరాలు నిండిన వడ్డెరలకు పెన్షన్ సౌఖర్యం కల్పించాలని, ఇళ్లు ఇవ్వాలని, కార్పొరేషన్ ద్వారా పూచ్చికత్తు లేకుండా రుణ సౌఖర్యం కల్పించాలని, వడ్డెర విద్యార్థులకు ఉచిత విద్యను ప్రభుత్వం కల్పించాలని కోరారు ఈ కార్యక్రమ ంలో వడ్డెర సంఘం సీనియర్ నాయకులు చల్ల రామ పుల్లయ్య, మండల అధ్యక్షులు దేరంగుల సుబ్బరాయుడు, వడ్డెర సంఘం డివిజన్ నాయకులు చల్ల శివ,పెద్ది రాజు,దండగల లాలెప్ప, మద్దయ్య,, రంగడు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి బుగ్గనను తన స్వగహం నందు కలిసిన వడ్డెరలు

నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన

ప్రజాశక్తి - వెలుగోడు

నంద్యాల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వెలుగోడు ఎంపిడిఓ కార్యాలయం వద్ద శుక్రవారం నాడు మండల స్పందన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అమానుల్లా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ స్పందన కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అధికారులు, మండల అధి కారులు హాజరవుతారని అన్నారు. మండల ప్రజలు తమకు ఏమైనా సమస్యలు ఉన్నచో, స్పందన కార్యక్రమంలో నమోదు చేసుకొని పరిష్కరించుకోవాలని సూచించారు.



ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని పాత బస్టాండ్‌లోని మున్సిపాలిటీ స్థలంలో అక్రమంగా వేసిన షెడ్డును తొలగించాలంటూ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుకు బిజెపి నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు అంబటి మహేశ్వర్ రెడ్డి, సింగం భరత్ రెడ్డి, శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటినుండో ఆ స్థలంలో పల్లెలకు సంబంధించిన ఆటోలు నిలబెట్టే వారన్నారు. మున్సిపాలిటీ స్థలంలో ట్యాంకు నిర్మాణాలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారని,దీంతో ప్రస్తుతం అక్కడ ఆటోలను ఉంచడం లేదన్నారు. ఇదే అదనుగా భావించి కొందరు ఆ స్థలంలో అక్రమ కట్టడాలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ స్పందిస్తూ విషయాన్ని చైర్మన్, మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రాష్ట్రంలో అప్రజాస్వామ్య పాలన : టిడిపి

ప్రజాశక్తి - చాగలమరి

బ్రిటిష్ పాలన తలదన్నేలా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. గురువారం మండలంలోని పెద్ద వంగలి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో చంద్రబాబు అరెస్టుపై ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజలంతా చంద్రబాబుకు మద్దతు పలకడాన్ని సిఎం జగన్ జీర్ణించుకోలేక స్కిల్ డెవలప్మెంట్ అంశాల్ని తెరపైకి తెచ్చి అబద్దాలను ప్రచారం చేస్తున్నార న్నారు. ఎన్ని కేసులు బనాయించినా చంద్రబాబు విడుదల అయ్యేవరకు పోరాటాలు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కనీసం కేసి కాల్వ, తెలుగంగలకు నీటిని ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, మైనార్టీ నాయకులు కొలిమి హుసేన్ వల్లి, ముల్లా మహబూబ్ పీరా, బాష, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రచ్చబండ నిర్వహిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ


సున్నిపెంటలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం మండలంలోని సున్నిపెంటలో 'భవిష్యత్తు గ్యారెంటీ, బాబుతో నేను' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ముందుగా స్థానిక డ్యామ్ వ్యూ అతిథి గృహం నందు పార్టీ నేతలు, బూత్ కన్వీనర్లతో పార్టీ సంస్థాగత కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు.

అందమైన పట్టణమే లక్ష్యం

- ఎంఏ రషీద్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దే లక్ష్యంగా అభివద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆత్మకూర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ. రషీద్ అన్నారు. గురువారం పట్టణంలోని 8వ వార్డు పరిధిలో నంద్యాల టర్నింగ్‌లో నూతన సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా వార్డ్ కౌన్సిలర్ మిట్ట కందల మహబతుల్లా పూల పుష్పం ఇచ్చి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం కౌన్సిలర్లు, వైసిపి నాయకులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు కొనసాగించడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా సహాయ సహకారాలతో పట్టణాభివృద్ధి జరుగుతోంద న్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఎస్ఎస్ సయ్యద్ మీర్, వార్డు కౌన్సిలర్లు రహిమాన్, శంకర్, పాణ్యం పార్వతి, రంగస్వామి, ప్రకాష్ రావు, షఫీవుల్లా, వైసిపి జిల్లా కార్యదర్శి తిమోతి తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంఏ రషీద్

డిగ్రీ హానర్స్‌లో ప్రవేశాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

స్థానిక బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల నందు 2023 విద్యా సంవత్సరంలో డిగ్రీ పాసైన విద్యార్థులు డిగ్రీ హానర్స్ నాలుగో సంవత్సరం నందు బీఎస్సీ కంప్యూటర్స్, బిఎస్సి బొటనీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ డిగ్రీ హానర్స్ గ్రూపుల నందు ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కే జాన్ ఎలీషా బాబు, కళాశాల కరస్పాండెంట్ వి.ఎన్ సత్య నారాయణ, చైర్మన్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ నాలుగో సంవత్సరంనందు చేరిన అర్హులైన ప్రతి విద్యార్థికి గవర్నమెంట్ ఫీజు రియంబర్స్మెంట్ సదుపాయం కలదని, నాలుగో సంవత్సరం డిగ్రీ హానర్స్ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ నందు డైరెక్ట్‌గా రెండో సంవత్సరం చదువు కునే అవకాశం కలదనీ తెలిపారు. ఈ అవకాశాన్ని డిగ్రీ పాసైన విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీమా తక్షణ సాయం పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈ నెల 18న అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని తోడేండ్లపల్లె గ్రామ నివాసి చల్లా ఏసోబ్ (45) కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంను సర్పంచ్ గోవిందయ్య, ఎంపీడీవో మహబూబ్ దౌలాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ బీమా చేసిన వారు సహజ మరణం చెందితే లక్ష రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని, అందులో భాగంగా తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 10 వేలు మృతుడి భార్య మార్తమ్మకు గురువారం అందజేసామన్నారు. మిగతా మొత్తాన్ని ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాల య కార్యదర్శి ప్రదీప్ కుమార్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి,వైసిపి నాయకులు అంకాల్ రెడ్డి,లక్ష్మయ్య,సంజీవరాయుడు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్ వాచ్‌మెన్ మృతి

- నివాళులర్పించిన మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని మార్కెట్‌యార్డులో అనేక సంవత్సరాల నుండి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న భగవాన్‌దాస్ (56) ఆనారోగ్య కారణంతో తన సొంతూరు తాటిపాడులో బుధవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ యార్ చైర్‌పర్సన్ షేక్ రాహత్‌జబ్బార్, వైసిపి సీనియర్ నాయకులు షేక్ జబ్బార్ ఆయన మృతదేహానికి గురువారం నివాళులర్పించి వారి కుటుంబం సభ్యలకు రూ. 15000 అందజేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డి దృష్టికి తీసుకెల్లడం జరిగిందని, మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా ప్రయత్నం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్ డైరెక్టర్ జలీల్ అహ్మద్ అధికారులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ రహత్ జబ్బార్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిడికెడు బియ్యం కార్యక్రమం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో పిడికెడు బియ్యం కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు సేకరించిన 60 కేజీల బియ్యము, రూ. 2,600 నగదుతో నిత్యవసర సరుకులు తీసుకొని పట్టణంలోని నిరాశ్రయుల వసతి నందు జంతుశాస్త్ర అధ్యాపకులు రామకృష్ణయ్య, విద్యార్థులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత మాట్లాడుతూ అనాధలను, వృద్ధులను ఆదుకోవాలని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు భారీ పూలమాలతో స్వాగతం పలికిన చాబోలు ప్రజలు

అభివృద్ధి పథంలో గ్రామాలు : ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

వైసిపి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాల మండలం చాబోలు గ్రామంలో 159వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్దిదారులు అందజేసి సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. కార్యక్మంలో ఎంపిడిఒ సుగుణ శ్రీ, సర్పంచి మౌనిక, ఎంపిటిసి చెన్నయ్య, ఉపసర్పంచి హుస్సేన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

జమ్మిచెట్టు వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జమ్మి చెట్టు (శమీ వృక్షం) దగ్గర గత కొన్ని ఏళ్లగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను గుర్తించిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మున్సిపల్ విద్యుత్తు సిబ్బందితో విద్యుత్ సౌకర్యంతో పాటు వీధి లైట్లు ఏర్పాటు చేయించారు. చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డినే చొరవ తీసుకొని జమ్మి చెట్టు దగ్గర స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నందుకు దసరా ఉత్సవ సమితి, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ ంలో ఉత్సవ సమితి సభ్యులు బద్దుల శ్రీకాంత్, ఆర్ట్ శ్రీను, మోటు మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం
